1) ప్రస్తుత వివాదం శ్రీరెడ్డి–కాస్టింగ్ కౌచ్‌కి సంబంధించినది. శ్రీరెడ్డి సినీపరిశ్రమ వ్యక్తి ప్రోద్బలంతో బూతుమాట తిట్టడం గురించి వివాదం. ఈ వ్యవహారం నుంచి మీడియా బాన్ అంశం ఎలా బయటకు వచ్చింది.?

2) శ్రీరెడ్డి వాడిన బూతుమాటను మీడియా ప్రసారం చేయకపోయినా మార్ఫింగ్ వీడియోలు తయారుచేసి ప్రజల్లో మీడియాపై ద్వేషం పెరిగేలా ఎందుకు వ్యవహరిస్తున్నారు.?

3) శ్రీరెడ్డితో నేనే తిట్టించానని ఆర్జీవీ చెప్పిన తర్వాత కూడా మీడియా ఆర్జీవీకి డబ్బులిచ్చిందన్న కుట్ర సిద్దాంతం తయారుచేసి ప్రజల్లో మీడియాను పలుచన చేయాలని చూశారు. ఈ ఆరోపణలకు ఏదైనా ఆధారం ఉందా అంటే.. లేదంటారు. ఒక అబద్దాన్ని ప్రచారం చేసి మీడియాను ఎందుకు టార్గెట్‌గా మార్చాలని చూస్తున్నారు..?

4) అసత్య ఆరోపణలతో మీడియాపైకి అల్లరిమూకలను రెచ్చగొట్టి విధ్వంసకాండకు పాల్పడడం సరైందేనని మీరు భావిస్తున్నారా?

5) సినిమా పరిశ్రమవారు ఇండస్ట్రీ తరపున కాకుండా రాజకీయనాయకులుగా, కుల సంఘ నేతలుగా వ్యవహరించడం, మీడియా మీద దాడికి దిగడం మీరు మద్దతిస్తారా..?

6) మీడియాపై అసత్య ఆరోపణలు చేసి అవాస్తవికమైన కుట్ర సిద్ధాంతాలు ఆపాదించి, అనుచరులను రెచ్చగొట్టి, కులం బురద అంటగట్టి దాడులు చేస్తాం, దూల తీరుస్తాం అని బహిరంగ ప్రకటనలు చేయడం సరైందేనా..?

7) ప్రపంచ వ్యాప్తంగా మీడియా శ్రీరెడ్డి అంశాన్ని, కాస్టింగ్‌కౌచ్ అంశాన్ని చర్చలో పెట్టింది. కేవలం తెలుగు మీడియాపై ఈ అంశంలో మీరు దాడిచేసి భయపెట్టి అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం లేదా..?

8) మీ వ్యవస్థలో ఓ అవలక్షణం గురించి చర్చ జరుగుతున్న సమయంలో ఆ అంశాన్ని పక్కదారి పట్టించడానికి మీరు మీడియాపై దాడికి దిగడం లేదా..?

9) టీవీ న్యూస్ మీడియాను నిషేధించాలని సలహా ఇస్తున్న పెద్దమనుషులు భవిష్యత్తులో రెండు మీడియాల మధ్య శత్రుత్వాన్ని సృష్టిస్తున్నామని చూడలేకపోతున్నారా..?

10) సినీ పెద్దలు అంతా జనసేనలో చేరారా? మీడియాపై చర్య గురించి చర్చించడానికి అన్నపూర్ణ స్టూడియోలో విస్తృత సమావేశం జరుగుతుందని జనసేన ఓ ప్రకటనలో పేర్కొంది. (ప్రకటనల కాపీ జతచేశాం) ఒక పార్టీ మీడియా పై దాడికి పూనుకుంటే సినీపరిశ్రమ మొత్తం తానా తందానా అంటుందా..?

11) విస్తృత సమావేశం అని చెప్పి ఒక వర్గానికి చెందిన వారిని మాత్రమే పిలిచి వారికి అనుగుణంగా తీర్మానాలు చేశారు. నచ్చనివారిని బయటకు పంపించారు. సినీ పరిశ్రమలో కొందరు ఏర్పాటు చేసిన కమిటీని ఛాంబర్ ఆమోదించినట్టు చూపే ప్రయత్నం చేయడం లేదా..? ఈ కొందరి మీడియా వ్యతిరేక వ్యాఖ్యలను మొత్తం పరిశ్రమకు ఆపాదించే ప్రయత్నం చేయడం లేదా..?

12) ఈ వర్గానికి చెందిన కమిటీ సభ్యులు 21 మంది అదే రోజు సాయంత్రం మీడియాను బాన్ చేయాలన్న నిర్ణయం ప్రకటించారు.

13) మీడియా బాన్ కాస్టింగ్ కౌచ్‌కు సంబంధించింది. ఈ వివాదంలో స్వంత లాభాల కోసం కొంతమంది న్యూస్ ఛానల్స్‌ని సినిమా రంగం నుంచి పూర్తిగా దూరంగా పెట్టాలనే పనిమొదలు పెట్టారు. అసలు వివాదానికి.. ఈ కొసరు వివాదానికి సంబంధం ఏమిటి.?

14) న్యూస్ ఛానల్స్‌లో ప్రకటనలు, సినిమా కవరేజ్‌ల గురించి మరో సందర్భంలో మాట్లాడుకోవచ్చు. కానీ కాస్టింగ్ కౌచ్ వ్యవహార వివాదంతో ఈ అంశాలను ముడిపెట్టి వ్యాపారలాభం కోసం రెండు మాధ్యమాల మధ్య ఘర్షణ కోరుకోవడం సరైందేనా..?

15) అసంబద్ధమైన ఆరోపణలలో కొన్ని ఛానల్స్‌కు మూవీ యాడ్స్ ఆపివేయడం సరైన పనేనా..?

16) శ్రీరెడ్డి బూతుమాట తర్వాత టీవీ న్యూస్ ఛానల్స్ స్వీయనియంత్రణలో భాగంగా ఆమెకు స్టూడియోల్లో అవకాశం ఇవ్వలేదు. న్యూస్ ఛానల్స్ సానుకూల స్పందన తర్వాత కూడా వ్యాపార ప్రయోజనాల కోసం రెచ్చగొట్టడం, ఆరోపణలు చేయడం భవిష్యత్ సంబంధాలను పూర్తిగా నాశనం చేస్తుందని మీకు తెలియదా..?

17) మీడియాలో లేని లోపాల్ని ఎత్తి చూపాలని మీరు చూస్తున్నారు. ఈ రోజు నుంచి పరిశ్రమలో అన్ని విభాగాల లోటుపాట్లని, డిస్ట్రిబూషన్, థియేటర్ సౌకర్యాల లోటుపాట్లని మేము నిరంతరం చూపించడం మొదలుపెట్టొచ్చా..?

న్యూస్ టీవీ ఎడిటర్స్ అసోసియేషన్